# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  18-10-2025          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఈ ఏడాది పండుగ వాతావరణంలో చేపట్టాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు సూచించారు.
- ❖ గాలి కాలుష్యం నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని మంత్రి పి.నారాయణ ప్రజలను కోరారు.
- ❖ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారుతుందని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- ❖ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ పెండింగ్ అంశాలపై ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉపసంఘం ఈ రోజు సమావేశమయ్యింది.
- ❖ వస్తు సేవల పన్ను తగ్గింపు కారణంగా వ్యవసాయ రంగానికి చాలా మేలు చేకూరుతోందని మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.

====================

ఈ ఏడాది ధాన్యం కొనుగోలు ప్రక్రియను పండుగ వాతావరణంలో చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు సూచించారు. విజయవాడలో ఈ రోజు మంత్రి అధ్యక్షతన అధికారులకు రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... గత ఏడాది ధాన్యం కొనుగోలు సమయంలో క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను ఈ సంవత్సరం ముందస్తు ప్రణాళికలతో పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గన్ని బ్యాగులు, రవాణా వంటి సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 60 రోజుల్లో బియ్యం సరఫరా చేసే రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పర్యవేక్షిస్తామని, అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు, నచ్చిన సమయంలో ధాన్యం విక్రయించుకునే అవకాశం కల్పించామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

====================

గాలి కాలుష్యం నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ కోరారు. విజయవాడలో ఈరోజు నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. గాలి కాలుష్యం వల్ల ప్రతి ఏటా ప్రపంచంలో 70 లక్షల మంది చనిపోతున్నారని తెలిపారు. ప్రజా రవాణాను ప్రోత్సహించాలని, చెట్లను నాటడంతో పాటు సౌర విద్యుత్ కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సూపర్ జీఎస్టీలో సోలార్ విద్యుత్ పై పన్ను భారీగా తగ్గించరాని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో మున్సిపాలిటీల్లో ఇంటింటికీ కుళాయి ద్వారా మంచి నీరు అందిస్తామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

====================

స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా ఆరోగ్య భారత్ ఆవిష్కరణ సాధ్యపడుతోందని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ రోజు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో మొక్క నాటాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుకు దేశ వ్యాప్తంగా మంచి స్పందన లభించిందన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారిపోతుందన్నారు. లక్షా యాభై వేల కోట్ల రూపాయల పెట్టుబడులు గూగుల్ డేటా సెంటర్ ద్వారా వస్తున్నాయని.. వీటివల్ల సుమారు రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు.

====================

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ పెండింగ్ అంశాలపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉపసంఘం ఈ రోజు భేటీ అయ్యింది. ఈ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించి పెండింగ్ డీఏలు సహా ఇతర అంశాలపై మంత్రుల బృందం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించింది. మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఓ కార్యాచరణ రూపొందించే విధంగా కసరత్తు చేపట్టారు.

====================

వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు కారణంగా వ్యవసాయ రంగానికి చాలా మేలు చేకూరిందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.  పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... వ్యవసాయ యంత్రాలు తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతోందని తెలిపారు. అనంతరం రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. రైతులకు 80 శాతం రాయితీపై నాణ్యమైన విత్తనాలను అందించామని వెల్లడించారు.

విరామం

====================

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య విద్యా సీట్లు భారీగా పెరిగాయి. గైనిక్, జనరల్ మెడిసిన్, ఇతర స్పెషాల్టీ కోర్సుల్లో ప్రస్తుతం ఉన్న వాటి కంటే అదనంగా 106 సీట్ల భర్తీకి జాతీయ వైద్య కమిషన్ ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇందులో 5 వైద్య కళాశాలల్లో కొత్తగా వచ్చిన సీట్లు 60

వరకు ఉన్నాయని పేర్కొన్నారు. తిరుపతి స్విమ్స్ కు పీజీ వైద్య విద్యలో మరో 13 సీట్లకు ఎన్ఎంసీ ఆమోదం తెలిపింది. గుంటూరు మెడికల్ కళాశాలలో రేడియోలజీ 4, ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎమర్జెన్సీ మెడిసిన్ 4, పీడియాట్రిక్ లో 4 చొప్పున అదనపు సీట్లు వచ్చాయి. అనంతపురం వైద్య కళాశాలకు 15, కడపకు 7, కర్నూల్ కు 4, శ్రీకాకుళం కళాశాలకు 8 చొప్పున అదనంగా సీట్లను ఎన్ఎంసీ కేటాయించింది.

====================

వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతోంది. ముఖ్యంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి జీఎస్టీ తగ్గింపుతో ఎక్కువ ప్రయోజనం కలుగుతోంది. మందుల ధరలు 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం, చిన్నారులు తాగే పాల పౌడర్లపై ఉన్న జీఎస్టీని సున్నా శాతం చేయడంపై తిరుపతి జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వస్తు సేవల పన్ను తగ్గింపు వలన పేదలకు సులువుగా వైద్యం అందుతోందని తిరుపతికి చెందిన చిన్నారావ్ ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

====================

అల్లూరి సీతారామరాజు జిల్లా దర్తీ ఆబా జన్ భాగిధారి అభియాన్ కింద ఉత్తమ జిల్లాగా ఎంపిక అవ్వడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. పీఎం జన్‌మన్, పీఎం జేజీయుఏ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసినందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఈ జాతీయ పురస్కారం అందుకుందని ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆ జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఈ పురస్కారాన్ని నిన్న అందుకున్నారు.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ నెల 21వ తేది నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ తదుపరి 48 గంటల్లో దక్షిణ మధ్య బంగాళాఖాతం, పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. వీటి ఫలితంగా రేపటి వర్ష సూచనలను వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకటరావు వెల్లడిస్తూ...

(వాయిస్ 17 సెకన్లు)

====================

శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి కోసం దళారులను నమ్మి మోసపోవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఛైర్మన్ బీఆర్ నాయుడు ఒక ప్రకటన ద్వారా భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవలి కాలంలో కొందరు దళారులు, మధ్యవర్తులు శ్రీవారి దర్శనం పేరుతో భక్తులను పలు మార్గాల ద్వారా మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే భక్తులను మోసం చేస్తున్న దళారులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

====================

====================